179) గుండక్రియ

ప॥ దేహ మిది యొకటే దేవుడ నీవొకడవే । యీహల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥

చ॥ రాతి రొక్క లోకము రవ్వపడె గలలోన । ఘాతల బగలొక్క లోకము వేగితే ।
యీతల రెప్పలే మర గిందుకు నందుకు జూడ । యేతుల రెంట దెప్పర మిదివో మాబదుకు ।

చ॥ సతికాగి లొకటే జవ్వనపుగాక రేచు । సుతకాగి లోకవేరేసుఖమై తోచు ।
మతిలోనిమర గింతే మగువలే యిద్దరును । ఇతవై రెంట దెప్పర మిదివో మాబదుకు ॥

చ॥ దైవమా నిన్నాతుమలో దలచి యానందింతు । పూవుల నిన్ను బూజింతు పొంచి వెలిని ।
శ్రీవేంకటేశ నీసేవలోని మరగింతే । యీవల రెంట దెప్పర మిదివో మాబదుకు ॥